# మళ్ళీ దీపావళి

"దీపావళిరోజూ ఆఫీసుకి వెళ్లాలా?"

"-( . అర్జెంటు పని ఉంది."

తల వొంచుకుని టోస్ట్ తింటున్న రాజశేఖరం తల ఎత్తలేదు. తన జవాబులో అసత్యం కన్న క్రౌర్యం ఎక్కువగా ఉందని అతనికి అనిపించింది. ఆమె టేబిల్ కి ఆ తలవేపు నిలబడివుంది. ఆమె కళ్లల్లోకి చూసేంత నిర్దయలేదు అతనిలో... ధైర్యమూ లేదు. ఆ కళ్ళలో వున్న దుఃఖం.. ఆరోపణలు అతను ఊహించుకోగలడు.

ఆమె లోపలికి వెళ్ళి టీపాట్ తెచ్చి అతని ముందు ఉంచి మళ్ళీ వెళ్లి పాలూ పంచదారా తెచ్చి పెట్టి, మళ్ళీ అలాగే నిలబడింది.

ఏం చెప్పాలని అనుకుంటూంది ఆమె? అని ఆలోచించాడు రాజశేఖరం. తన మనస్సుని కప్పిన ఈ చీకటితెరల్ని తొలగించే ప్రయత్నం ఆమె చెయ్యదు. కాని, ఈవేళ. రాత్రి రానున్న దీపాలపండుగ ఆమెని ఏం చెయ్యడానికి ప్రేరేపిస్తోంది?

అతను పేపర్ చూస్తూ టోస్ట్ తింటున్నాడు. అది ముగిసేసరికి ఆమె కప్పులో పంచదార వేసి. టీపాట్ కోసం చెయ్యి చాపేలోపున అతను తొందరగా పాట్ అందుకుని టీ పోసుకున్నాడు.

ఆమె నీరసంగా కుర్చీలో కూర్చుంది.

"ఇవేళ..."

అవును. తనకి తెలుసును—ఈ రోజు ఈవేళ. వెలుతురుతో చీకట్లని తరిమే పండుగ.. పటాకాల శబ్దాలతో దుఃఖాల నిశ్శబ్దాన్ని తరిమే పండుగ.. కాని..

"వాడికోసం సామాన్లు తెప్పిస్తే మీకు కోపం వొస్తుందా?"

అతను టీ తాగి, మళ్ళా ఇంకో కప్ పోసుకున్నాడు—"నీ ఇష్టం శశిరేఖా!... వాడిమీద కాని, నీమీద కాని నాకు కోపం లేదని నీకు తెలుసును. సామాన్లు తప్పకుండా తెప్పించు—రాత్రి ఆలస్యంగా వొస్తాను."

అతను లేచి నోరు కడుక్కొని అటునించే వీధిలోకి నడిచేడు. కారు గరాజిలో ఉంది—బయటికి తీసే ఓపిక లేదు—టాక్సీ కోసం లోవర్ సర్క్యులర్ రోడ్డుదాకా నడిచేడు.

శశిరేఖ ఏమనుకుంటూంది?...

హటాత్తుగా తల ఎత్తి చూశేడు—రోడ్డుకి అటు ప్రక్కన ఆయా వాడిని ఎత్తుకుని తీసుకొస్తూంది... పేవ్ మెంటు మీద నిలబడి, రెండు నిమిషాలు అలాగే చూశాడు...మాధవ్... ఎవరు పెట్టేరు వాడికి పేరు?

హటాత్తుగా మాధవ్ తనని చూసి, చేతులు ఊపేడు. కష్టపడి ఆయా వాడిని మళ్ళించింది—శేఖర్ త్వరగా నడిచి అటు నుంచి వొస్తూన్న టాక్సీలో కూర్చుని ఆఫీసు చేరుకున్నాడు.

ఆఫీసులో ఎవ్వరూ లేరు—సెలవాయి తప్ప. తను తప్ప. ఇవాళ తనకి పనివున్న మాట నిజమే—కాని, ఏ సెలవు వొచ్చినా తాను ఇంట్లో ఉండడు...శశిరేఖకి తెలుసును, తనకి తెలుసును... మాధవ్ కి తెలీదు.

"డా...డీ!"

వాడు తన దగ్గరకే వొస్తాడు వీలైనప్పుడల్లా...కాని—ముళ్లు గుచ్చుకున్నట్లు ఉంటుంది తనకి...శశిరేఖ వొచ్చి వాడిని తీసికెళ్ళేదాకా. ఏ ఫ్రెండ్స్ వొచ్చినా చూసి ముచ్చటగా, 'ఎంతబాగున్నాడు!' అన్నప్పుడల్లా ప్రాణం పోయినట్లుంటుంది తనకి...

ఫేన్ పెట్టుకుని, సిగరెట్ వెలిగించుకుని కాగితాలు చూడసాగాడు రాజశేఖర్. తనకి ఇదే జీవితం—ఈ ఫైళ్ళే పిల్లలు..

"గుడ్ మార్నింగ్ సర్!"

"గుడ్ మార్నింగ్!"

"లేటయ్యాను.. సార్!"

"బాధ లేదు.."

ఆమె కూర్చుంది. రెండేళ్ళనించీ ఆమె తనతో పని చేస్తోంది. తనకోసం ఆమె ఏమైనా చేస్తుంది—తనకి తెలుసును. కాని, ఆమెమీద అభిమానం తప్ప మరో భావం ఎన్నడూ కలగలేదు తనకి. అతని గుణం అంత.

టేబిల్ మీద కాగితాలు చిందరవందరగా పడివున్నాయి—నిన్న సాయంత్రం తనే అలాగ పడేశాడు. వెతికి, డిక్టేషన్ మొదలుపెట్టేడు.

పని సాగడంలేదు—మనస్సు ఎలాగో ఉంది.

"ట్రాన్సిస్టర్ లైసెన్స్ ఫిగర్స్ కావాలి—దయచేసి, సూపరెంటు టేబిల్ వెతకండి."

తాళాలు తీసుకుని ఆమె వెళ్లింది.

మళ్ళీ సిగరెట్ వెలిగించాడు శేఖర్. హటాత్తుగా మధుసూదనరావు—మధు—జ్ఞాపకం వొచ్చాడు. ఆనాడు యూనివర్సి

---

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

టీలో విచిత్రమైన పరిస్థితుల్లో అతనికీ తనకూ స్నేహం ఐంది. ఒకరోజు అర్ధరాత్రి రైలు దిగి అతను హాస్టలుకి వచ్చేడు. శేఖర్ నిద్ర రాక కేంపస్‌లో తిరుగుతూ టాక్సీలో వొచ్చిన అతన్ని చూశాడు.

"ఏ రూము మీది?"

తనే పలకరించాడు–టాక్సీ వెళ్ళిపోయి అతనూ, సామాన్లూ రోడ్డుమీద ఉండిపోవడం చూసి.

నవ్వి, "తెలీదండీ! – నాలుగ్గంటలకి రావాల్సిన రైలు పదకొండున్నరకి వొచ్చింది..." అన్నాడు.

ఆ క్షణంలోనే వాళ్ళిద్దరూ స్నేహితులైపోయారు – "నా గదికి రండి ... ఫస్ట్ ఫ్లోర్‌లోనే ఉంది. రేపు వార్డెన్‌ని అడిగి మీ గదికి వెళ్ళవచ్చును"

ఇద్దరూ సామాన్లు మీదికి మోసుకుని వెళ్లి మూడుగంటల దాకా కబుర్లు చెప్పుకున్నారు. మర్నాడు ఆ గదిలోనే ఇద్దరూ ఉండేలాగ ఏర్పాటు ఐపోయింది. రాజశేఖరం పొలిటిక్స్ ఆనర్సూ, అతను ఎమ్. ఎస్‌సి. ఆనర్సు డిగ్రీలు తీసుకుని యూనివర్సిటీ వొదిలేదాకా ఆ స్నేహం ప్రగాఢం అవుతూనే ఉంది:

ఆ రెండేళ్ళలోనూ రాజశేఖరం మధు సహాయం లేకపోతే చదవిఉండేవాడు కాదు ఇంట్లో వొచ్చిన కలతలు ... అన్నింటో కలహం – అన్నిట్లోనూ ...డ కున్నాడు మధు–తనకు జ్వరం వొస్తే కా... జీకి వెళ్ళడం మానేసి అహోరాత్రాలు సేవచేసి ప్రాణం దక్కించాడు మధు ... డబ్బు మాట సరేసరి ... తన కాంపిటీటి...



పరీక్షకి ఫీజు కట్టి బలవంతాన పంపించేడు- ఆడిట్ అకౌంట్స్‌లో తన సెలక్షన్‌కీ, ఈనాడు ఈ హోదాకి నిస్సందేహంగా కారణం అతనే ..మధు...

కాగితాలు పట్టుకుని వొచ్చింది స్టెనో. డిక్టేషన్ ముగించేసరికి పన్నెండున్నర. టైపు చెయ్యడానికి ఆమె వెళ్లింది. పడి ఉన్న మిగిలిన ఫైళ్ళన్నీ చూసి, టేబిల్ ఖాళీ చేసి ఒంటరిగా కూర్చున్నాడు రాజశేఖరం...

ఒంటరి...

ఎక్కడో టపాకాయిలు పేలుస్తున్నారు - ఈ మహానగరంలో. లక్షలాది జనం మధ్య తను ఒంటరి...

ఇక్కడ చదువు ముగించాక మధు రెండేళ్ళు అమెరికాలో (అతను 'స్టేట్స్' అంటాడు) రిసెర్చి చేసివొచ్చి బొంబాయిలో ఐ. సి. ఐ. లో చేరాడు ... అతనికి నెలకి మూడువేలు జీతం . ఇల్లూ, కారూ, గాక అతనికి ఎంత అదృష్టం కలిగినా, శేఖరం దృష్టిలో చాలదు-కాని...

అతనికి ఉత్తరం రాసి మూడేళ్ళయిపోయింది.. ముందర అతను టెలిఫోన్ చేశాడ -తను సరిగా మాట్లాడలేదు-బాధపడి, మధు క్రమంగా ఉత్తరాలు తనకి రాయడం మానేశాడు. అప్పుడూ అప్పుడూ శశిరేఖకి రాస్తూఉంటాడు. కాని-తనకి పరాయివాడే అయిపోయాడు పూర్తిగా.

ఎవరి తప్పు?

—తనదే.. తనదే...

లేచి పచారు చెయ్యడం ప్రారంభించాడు రాజశేఖరం బాధపెట్టే ఈ ఆలోచనలు దోమల్లాగ ముసురుకుంటున్నాయి- ఇవేళ మరీని...అవును, దీపావళి అంటే చాలు.. ఇలాగే...

దర్వాన్‌ని పిలిచి డబ్బిచ్చి, కాఫీ తెమ్మని పంపించేడు శేఖరం స్టెనో పక్క గదిలో టైపు చేస్తూన్నది. ఈ ఏకాంతంలో తన ఒంటరితనం వెయ్యిపడగలతో తనని బాధిస్తోంది. కాని, ఎందరిమధ్య ఉన్నా ఈ ఒంటరితనం, ఈ ఆలోచనల విషాలు తనని వదలవు...తన జీవితశాపం అది-

ఏదో పుస్తకం తీసి చదవసాగాడు— కనీసం మనస్సుకి కొంచెం మార్పుకోసం. మాధవ్ జ్ఞాపకం వొచ్చాడు.

నిన్న సాయంకాలం...

తలనొప్పిగా వుండి కొంచెం త్వరగా ఆఫీసు వొదిలి నాలుగ్గంటలకే ఇల్లు చేరుకున్నాడు తను. తలుపు తాళం తీసుకుని, తోశాడు తను. తలుపుదగ్గర ఆడుతున్నాడు మాధవ్. తలమీద దెబ్బ తగిలింది. వెక్కిపడి గుక్కపెట్టేడు.

తానట్లాగే నిలబడిపోయాడు. చిన్నపిల్లవాడు తన మూలాన్న తగిలింది... లేవదీయడం గాని, ఓదార్చడం గాని తాను చెయ్యలేకపోయాడు శశిరేఖ నిద్ర లేచి పరిగెట్టుకుని వొచ్చి...

ఆ దృశ్యం తలుచుకున్నప్పుడల్లా తనికి ఎంతో సిగ్గువేస్తోంది కాని...తన మనస్సులో లేని అభిమానం వాడిమీద ఎలాగ చూపగలడు తాను? ఆ క్షణంలో అత్యంతంగా జాలివేసినమాట నిజం కాని తను చేతులు జాపి వాడిని ఎత్తుకోలేదు- కృత్రిమంగా వాడిని ఓదార్చలేదు... తనలోవున్న మానవత్వం ఏమైపోయింది?

కొంచెంసేపు ఏడిచి, తల్లి చేతుల్లో నిద్రపోయాడు వాడు. తరవాత శశిరేఖ తన గదిలోకి వొచ్చి, "ఏమైనా కావాలా?" అంది.

'శాంతి - నా సమస్యలకి పరిష్కారం,' అనుకున్నాడు తాను. కాని "ఏంవొద్దు- చికాకుగా ఉండి వొచ్చేశాను - వాడిని చూసుకోలేదు," అన్నాడు తాను.

అంతే. ఆమె ఏమీ అనలేదు ఏం విచిత్రసంసారం తనది!

బలవంతాన ఆలోచనల్ని పుస్తకం మీదకి తిప్పుకున్నాడు శేఖర్. మరో పదిహేను నిమిషాలకి కాఫీ వొచ్చింది. స్టెనోని పిలిచి, టేబిల్‌మీద కప్పుల్లో కాఫీ పోశాడు

"మీ దీపావళి పాడుచేశానా?"

"లేదండీ! - మా ఇంట్లో దీపావళి చెయ్యరు - నాన్నగారు పోయినది ఈ రోజే"

"సారీ..."

కాఫీ నిశ్శబ్దంగానే ముగించి ఆమె వెళ్లిపోయింది - టైము మూడు అవుతోంది.

మూడేళ్ళ క్రిందట - తాను నాగపూర్‌లో ఉండేవాడు. మధు ఉత్తరం రాస్తే దీపావళికని సెలవుపెట్టి వెళ్ళేడు. తనని చూసి ఉప్పొంగిపోయి కౌగలించుకున్నాడు మధు-స్టేషన్‌లోనే. తనకీ అతన్ని చూసి అంతగానూ ఆనందం కలిగింది. మెరీన్‌డ్రైవ్‌లో ఫ్లాటు అతనిది.

అక్కడ తనకి శశిరేఖతో పరిచయం ఐంది. ఆమెని చూసి ఆశ్చర్యపోయాడతను. నిశ్చేతనంగా తన నమస్కారానికి ప్రతినమస్కారం చెప్పి ఆమె లోపలికి వెళ్లిపోయింది. ఆమె ముఖంలో స్పష్టంగా కనిపిస్తోన్న దుఃఖానికి తనకు కారణం తెలీలేదు.

ఆరోజు తనకి బొంబాయి అంతా చూపెట్టి, సాయంత్రం ఇండియా గేటు దగ్గరకి తనని తీసికెళ్ళాడు మధు. ఏదో తనకి చెప్పాలని అతననుకుంటున్నాడు- కాని...

"శశిరేఖని చూశావుగా!"

బాధగా అన్నాడు కిందని కూర్చుని, నేలమీదికి చూస్తూ, మధు.

"ఆఁ..."

"మొన్ననే వొచ్చింది..."

అర్థం కాలేదు. అతనికి ఒక్క చెల్లెలు మాత్రమే ఉందనీ, ఆమె అంటే అతనికి పంచప్రాణాలూ అనీ తనకి తెల్సును. కాని, తాను గమనించీ, గ్రహించని ఈ పరిస్థితి ..



కష్టంగా చెప్పేడు మధు - "వారం రోజులక్రిందట ఆమె ఆత్మహత్య చేసుకోబోయింది..."

శేఖర్ తృళ్లిపడ్డాడు - మూర్ఖంగా, "ఎందుకని?" అన్నాడు-ఆతృతతోనే.

అతను తల ఎత్తకుండానే, "...ఆమె మనస్సు మరీ నవనీతం లాంటిది ... ఎవరు ప్రయత్నించినా మోసగించగలరు" అని, ఆగిపోయాడు.

వెయ్యి ఆలోచనలు ప్రవహించసాగాయి శేఖర్ మెదడులో-

"ఆమెని..."

"ఆఁ... నాలుగో నెల...వాడి పేరు చెప్పదు. శశికి ఏ ప్రమాదం జరిగినా నాకు ప్రాణం పోతుంది- వాడి మీద

కోపంకన్నా, ఆమెని గురించిన బాధ ఎక్కువగా ఉంది..."

అర్థం అయింది—చివరికి. ఏ క్షణిక దౌర్బల్యంలోనో అతని ముద్దుచెల్లెలి జీవితం ఎవరో నాశనం చేశారు—దానితోబాటు మధు జీవితంకూడా నాశనం ఔతోంది.

"సారీ, మధూ..."

అతను శేఖర్ చెయ్యి పట్టుకుని—"నీకు తప్ప ఎవరికి చెప్పేది శేఖర్!—ఆమె బాధ పడుతోంటే నా జీవితం ముక్కముక్కలై పోతోంది. మళ్ళీ ఆత్మహత్యా ప్రయత్నం చెయ్యనని మాట ఇచ్చింది. కాని, అక్కడ ఉంటే ఏమౌతుందోనని అమ్మని వొప్పించి ఇక్కడికి తీసుకొచ్చేను. ఈ మహానగరంలో చాలా సౌకర్యాలు ఉంటాయి...అజ్ఞాత వాసానికి..."

తరవాత ఇద్దరూ మాట్లాడుకోలేదు—ఏవో తెరలు ఆ ఇద్దరి మధ్యా పడిపోయాయి. రాత్రి తొమ్మిదికి ఇంటికి చేరారు.

ఇంటికి చేరేక, మధు లేని ఉత్సాహం తెచ్చుకుని నటించసాగాడు. బలవంతాన్న ఆమెని డిన్నర్‌కి తీసికొచ్చాడు. ఒక్కసారి ఆమెని నవ్వించాలని ఎంతో ప్రయత్నించాడు!

ఆరోజు జ్ఞాపకం వొచ్చినప్పుడల్లా కత్తితో కెలికినట్లవుతుంది మనస్సులో... మధు ఎంత దుఃఖం భరిస్తున్నాడు! అంతకన్నా కష్టం—ఆ ఉత్సాహం—ఆమెకోసం—నటించడం!

ఆ మరునాడు దీపావళి!...

టైపుచేసి కాగితాలు తెచ్చింది స్టెనో. ప్రస్తుతానికి వొచ్చి, అందులో నిమగ్నుడై పోయాడు శేఖర్. టైము నాలుగు ఐపోయింది.

"థాంక్స్...చాలా శ్రమపడ్డారు..."

సంతకం చేసి ఆమెకి ఇచ్చేశాడు. ఆమె వెళ్ళిపోతూ, "హేపీ దివాలీ!" అని చెప్పి, వెళ్ళింది.

అతను జవాబు ఇవ్వలేదు. ఏమని ఇస్తాడు? తన ఇంట్లో ఎప్పుడూ అమావాస్యే—దీపావళి ఎప్పుడూ రాదు. తనకీ శశిరేఖకీ మధ్య ఎంత అగాధం ఉంది!—చీకట్ల అగాధం.

—ఆరోజూ దీపావళి... మధు బాధ తనకి తెల్సును. ఆమె కనిపించినప్పుడల్లా అతనికి మధు ఎంత బాధపడుతున్నాడో ననిపించేది. ఆ మధ్యాహ్నం మధు నిద్రపోతున్నాడు. తను బాల్కనీలో కూర్చున్నాడు. ఆమె హఠాత్తుగా వొచ్చి కూర్చున్నది. ఏం మాట్లాడాలో తెలియలేదు తనకి. ఆమె హృదయంలో చెలరేగుతోన్న దవానలం తననీ బాధించసాగింది. పదిహేను నిముషాలలో వెయ్యి ఆలోచనలు వొచ్చాయి తన మనసులో... అప్రయత్నంగా, "శశిరేఖా! నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అన్నాడు రాజశేఖరం.

క్షణమాత్రం ఆమె ఆశ్చర్యపడింది—వెనకనించి మధు హఠాత్తుగా వొచ్చి తనని కౌగలించుకున్నాడు—"శేఖర్!... శేఖర్!... నిజంగా..." ఆ క్షణంలో మధు ఆనంద భాష్పాలు తనకి జ్ఞాపకం ఉన్నాయి..

వాచీ చూసుకున్నాడు శేఖర్—ఐదుకి ఇంకా ఇరవై నిముషాలు బాకీ ఉన్నాయి. ఐదుదాకా క్లబ్ తెరవరు

ఆ మర్నాడే తను శశిరేఖని సివిల్ మారేజ్ చేసుకున్నాడు.. ఆ తరవాత మాధవ్ బొంబాయి హాస్పిటల్‌లో పుట్టేడు—తను వెళ్ళేడు, విధిగా.

తరవాత ఆమె తనతో వచ్చేసింది—ఇక్కడికి ట్రాన్స్‌ఫరు అయింది తనకి

మూడు సంవత్సరాలు. మొదటినించీ తన మనస్సులో తనకేదో అన్యాయం జరిగిందని వ్యథ—క్రమంగా పొరబాటు చేశాననే బాధ—శశిరేఖ మీద జాలి ఎంత ఉన్నా, ఆమెని ప్రేమించలేకపోయాడు తాను. ఈ కథలో తనే దోషి అని తనకి తెలుసును. కాని...

లేచి గదిలోనించి వెళ్ళబోతూంటే టెలిఫోను మోగింది.

సుందర్రావు—అకస్మాత్తుగా తనకి అప్పుడూ అప్పుడూ తటస్థపడుతూ ఉంటాడు. అతనికి ఏదో ఫర్మ్‌లో పెద్ద ఉద్యోగం. తెగ తాగుతాడు.

అతను ట్రాన్స్‌ఫరై మద్రాసు వెళ్ళిపోతున్నాడు—వొచ్చి తనతో సాయంత్రం గడపమని అడగడానికి టెలిఫోన్ చేశాడు. శేఖర్ అంగీకరించాడు. తను వొంటరి—అతనూ వొంటరి...

తొందరగా బయటికి వొచ్చి టాక్సీలో పార్క్‌స్ట్రీట్ చేరేడు. అతను వెళ్ళేసరికి సుందర్రావు బాగా తాగివున్నాడు. మంచంమీద కూర్చుని, "రండి—పదున్నరకి నా రైలు — అప్పటిదాకా బ్రతికివుంటే" అంటూ ఆహ్వానించాడు.

శేఖర్ అట్టే తాగడు—ఎప్పుడైనా స్నేహితులతో ఒక్కగ్లాసు కన్న. అతనికి సుందర్రావుమీద జాలివేసింది. అతన్ని గురించి ఎన్నో కథలు విన్నాడు—అతను బ్రహ్మచారి అని తెలుసును. కులాసా మనిషి—నలభై ఏళ్లు ఉంటాయి.

సుందర్రావు గ్లాసులో విస్కీ పోసి, సోడా కలిపి శేఖర్‌కి ఇచ్చాడు. "దీపావళికి..."

శేఖర్ సమాధానం ఇవ్వలేదు. ఆ గదిలో ఏదో వింతగా ఉంది అతనికి. సుందర్రావు సామాను వెళ్ళిపోయింది—

ఒక్క సూట్ కేస్ తప్ప. తన జీవితం లాగే ఉంది ఆ గది! అంతకన్నా వెలవెల బోతూ ఆ మనిషి.

కొన్ని నిమిషాల నిశ్శబ్దం తరవాత "సుందర్! ఎందుకు మీరిలాగ అయిపోయారు?" అన్నాడు శేఖర్.

నవ్వబోయాడు సుందర్రావు. ఏడుపులాగ వొచ్చింది.

"ఏముంది శేఖర్!...ముందర తాగుడు – ఆ తరవాత స్త్రీలు ఆ తర్వాత..."

సుందర్ కళ్ళల్లోకి ఏదో చెప్పలేని బాధవొచ్చింది. శేఖర్ గమనిస్తున్నాడు..." ఆఁ?"

సుందర్ గ్లాసు ఖాళీచేసుకుని మళ్ళీ విస్కీ పోసుకున్నాడు – "ఈవేళ దీపావళి శేఖర్...నా ఆఖరిరోజు ఇక్కడ. చెప్తాను నీకు–ఒక్కడికీ. నిరుటిదాకా ఇంత తాగే వాణ్ని కాదు – నిరుడు హాస్పిటల్‌కి వెళ్ళను, జ్ఞాపకం ఉందా?..."


"అవును..."

"ఇక్కడి ఆడవాళ్ళు ఇచ్చిన శిక్ష అది. ఆ తరవాత – ఇంక నాకు వివాహం, పిల్లలూ అబద్ధం ఐపోయింది..."

భగవాన్! అనుకున్నాడు శేఖరం.

"అప్పుడు జ్ఞాపకం వొచ్చింది–కటక్‌లో అలాగే ఒక అమ్మాయిని ఒక్కసారి– ఏదో పార్టీలో, మోసం చేశాను... మూడేళ్ళ క్రిందట..."

వింటున్నాడు శేఖర్.





"ఆ మాటే మరిచిపోయాను ఆ రోజు దాకా...నాలుగు నెల్లయింది. ఒకనాడు విక్టోరియా మెమోరియల్‌లో ఆమె కనిపించింది - నా పరిస్థితిలో ఆమె ఏమీ ఉద్రేకం కలిగించలేదు...కాని..."

గ్లాసు తీసుకుని సగం కాళీచేశాడు సుందర్రావు. శేఖర్ గ్లాసు ముట్టనేలేదు.

"ఆ వేళ ఒక్కసారి నేను చేసిన మోసానికి పుట్టిన పిల్లవాడు ఆమెతో ఆడుకుంటున్నాడు - ఆమె చూడకుండా వాడి ఫోటో తీసుకున్నాను. దగ్గరగా వెళ్లేధైర్యం లేకపోయింది శేఖర్! ఆ రోజునించీ నాకు జీవితంమీదే విరక్తి... ఆమెని మోసగించాను - క్షణిక దౌర్బల్యంలో ఆమెని...కాని, ఈ శిక్ష!... నా వయస్సు తెలుసా? ముప్పైఆరు - ఈ జన్మకి పిల్లలు లేరు!...వాడు...వాడు"

సుందర్రావు పర్స్ తీసి, స్నేప్ షాట్ ఒకటి అతనికి ఇచ్చాడు. తీసుకుని ఒక్కసారి చూసి జేబులో పెట్టుకున్నాడు శేఖర్.

సుందర్రావు విపరీతంగా ఏడుస్తున్నాడు. టేబిల్ మీది విస్కీసీసా కిందకి పడిపోయింది. అది తీసే ప్రయత్నం ఎవరూ చెయ్యలేదు. అతని ముఖం వికృతంగా, భరించలేని దైన్యంతో ముడుచుకుపోయిఉంది.

పదిహేను నిమిషాలు అలాగే నిలబడి ఆ సగం మైకంలో సుందర్రావు మాటలు వింటున్నాడు శేఖర్.

"— వెంకట్రావు ఆరోజు నాకు చెప్పాడు ఆ అమ్మాయి గతి - పెళ్ళిచేసుకొమ్మన్నాడు. నవ్వి ఊరుకున్నాను... ఇది కొత్తవిషయంకాదు అన్నాను."

ఎక్కడో ఆరుగంటలు కొట్టింది గడియారం. సుందరం వికృతంగా ఏడుస్తూ తలగడలో ముఖం దాచుకున్నాడు.

నెమ్మదిగా తలుపు దగ్గిరగా వేసి. మెట్లు దిగి కిందికి వొచ్చాడు శేఖర్. ఇంకా బాగా వెలుతురు ఉంది.

తొందరగా నడచి ఇంటికి చేరుకున్నాడు శేఖర్. సుందర్రావు అతనిలో విపరీతమైన కలవరం తెప్పించేడు.

శశిరేఖ అతన్ని చూసి తెల్లబోయింది– అతను స్నానం చేసివొచ్చి, ఆమె గదిలోకి వెళ్ళాడు. అమె మాధవ్‌ని దగ్గరగా తీసుకుంది–వాడు విడిపించుకుని తన దగ్గరకి రాబోయాడు. వారించింది.

"వాణ్ని—రానీ..."

రెండుచేతుల్తోనూ వాణ్ణి ఎత్తుకుని వాడి ముఖంలోకి చూశాడు శేఖర్. నవ్వుతున్నాడు మాధవ్.

"సామాన్లు తెచ్చావా?"

సగం ఆశ్చర్యంగా, సగం అనుమానంగా–"ఆఁ..." అంది శశిరేఖ.

"ఇవేళ ఇంటినిండా దీపాలు పెట్టు శశీ!...మూడేళ్ళ చీకట్లు పోయేలాగ... మాధవ్! కావలసిన సామాన్లు తెస్తాను–కేండిల్స్ తెచ్చావా?"

"ఆఁ..."

"ఇంకా తెస్తాను. ఈవేళ చాలా దీపాలు కావాలి..."

నిశ్చేతనంగా నిలబడి చూస్తోంది శశిరేఖ.

మాధవ్ అతని చేతుల్లోంచి జారి ఆటబొమ్మలు తీసుకున్నాడు. ఎక్కడో జోరుగా టపాకాయిలు కాలుస్తున్నారు.

మాట్లాడవేం శశిరేఖా? ... ఇవేళ దీపావళి!"

చేతు లామె భుజాలమీద వేసి తన వేపు తిప్పుకున్నాడు రాజశేఖరం. ఆమె కళ్ళు తడిగా ఉన్నాయి.

ఆమె తలఎత్తి అతని ముఖంలోకి చూసింది. అతని వెనకాల వెలుగుతోన్న దీపం ఆమె కళ్ళల్లో వంద జ్యోతుల్లాగ ప్రతిఫలిస్తోంది. అతను మెల్లిగా ఆమె కళ్ళలోంచి జారుతోన్న అశ్రుకణాలని తుడిచి, ఆమెని దగ్గరగా తీసుకున్నాడు.

ఆ సాన్నిహిత్యం ఆమె మనసులో వెయ్యి దీపాలై వెలిగింది. ఆమె ముఖంలోకి వొచ్చిన కాంతి అతని కళ్ళల్లో లక్ష జ్యోతుల్ని వెలిగించింది.

అతని జేబులో స్నాప్‌షాట్ నలిగిపోతోంది. మాధవ్ ఏదో అంటున్నాడు ఉత్సాహంగా.

అతనికీ, ఆమెకీ ఆటు దృష్టిలేదు.

